సిద్దిపేటలో రెండు రోజులు కరెంట్ బంద్

సబ్ స్టేషన్‌లో భారీ అగ్నిప్రమాదం

కోట్లాది రూపాయల ఆస్తినష్టం

- సిద్దిపేట, దుబ్బాకలో నిలిచిన కరెంట్ సరఫరా
- మూడు గంటలపాటు ఎగసిపడిన మంటలు
- రాత్రి 10 గంటల సమయంలో అదుపులోకి
- ఘటనా స్థలానికి మాజీ మంత్రి హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- రెండు గంటలపాటు అక్కడే ఉండి పర్యవేక్షణ

ఎగసిపడుతున్న అగ్నికీలల మధ్య సిద్దిపేట సబ్‌స్టేషన్

సిద్దిపేట, ఫిబ్రవరి 21: సిద్దిపేట పట్టణం లోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద ఉన్న 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధవారం సాయంత్రం 6.58 గంటల ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మంటలు పెద్ద ఎత్తున ఎగసిపడ్డాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించినప్పటికీ ట్రాన్స్‌ఫార్మర్లు పేలడంతో ప్రమాద తీవ్రత మరింత పెరిగింది. ట్రాన్స్‌ఫార్మర్లు పెద్ద శబ్దంతో పేలడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ప్రమాదం కారణంగా సిద్దిపేట, దుబ్బాక సహా పరిసర గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయి అంధకారంగా మారింది. రేపటి వరకు కూడా విద్యుత్తు పునరుద్ధరణ సాధ్యం కాకపోవచ్చని అధికారులు చెప్తున్నారు. ప్రమాదంలో కోట్ల రూపాయల నష్టం వాటిల్లినట్టు పేర్కొన్నారు. విద్యుత్తు ట్రిప్ కావడం వల్లే ప్రమాదం జరిగినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రమాదానికి గల పూర్తికారణాలపై ఆరా తీస్తున్నట్టు విద్యుత్తు అధికారి శ్రీనివాస్ తెలిపారు. మునిపాలిటీకి చెందిన వాటర్ ట్యాంకర్ల ద్వారా కోమటిచెరువు నుంచి నీళ్లు తెప్పించి మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. విద్యుత్తు డిమాండ్‌కు సరిపడా సరఫరా లేకపోవడంతోనే లోడ్ ఎక్కువై ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయినట్టు భావిస్తున్నారు.

ఘటనా స్థలానికి హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి

ముస్తాబాద్ చౌరస్తాలో 220 కేవీ సబ్‌స్టేషన్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు.. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. అధికారులను అడిగి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. మంటలను అదుపులోకి తెచ్చేందుకు విద్యుత్తు, రెవెన్యూ, మున్సిపల్, ఫైర్ అధికారులకు పలు సూచనలు చేశారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో గజ్వేల్, దుబ్బాక ప్రాంతాల నుంచి మరిన్ని ఫైర్ ఇంజిన్లను తెప్పించి త్వరగా మంటలు అదుపులోకి తెచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మూడు గంటలపాటు ఎగసిపడిన మంటలు ఎట్టకేలకు రాత్రి 10 గంటల సమయంలో మంటలు అదుపులోకి వచ్చాయి. హరీశ్‌రావు దాదాపు రెండుగంటలపాటు ఘటనా స్థలంలోనే ఉండి అధికారులతో మాట్లాడుతూ పరిస్థితిని పర్యవేక్షించారు. ప్రమాదస్థలికి సిద్దిపేట సీపీ అనురాధ, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు చేరుకున్నారు.

ఘటనా స్థలంలో పరిస్థితిని చక్కదిద్దే ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

విచారణ చేపట్టాలి: హరీశ్‌రావు

విద్యుత్తు సబ్‌స్టేషన్ ప్రమాదంపై లోతుగా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ప్రమాద విషయం తెలిసి సిద్దిపేటకు వస్తూనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో ఫోన్‌లో మాట్లాడినట్టు తెలిపారు. విద్యుత్తుశాఖ డైరెక్టర్‌తోపాటు ఉన్నతస్థాయి అధికారులను వెంటనే పంపాలని కోరినట్టు చెప్పారు. విద్యుత్తుశాఖ కార్యదర్శి రిజ్వీతో కూడా ఫోన్‌లో మాట్లాడినట్టు పేర్కొన్నారు. విద్యుత్తు, అగ్నిమాపకశాఖ అధికారుల ప్రత్యేక కృషితో మంటలు పూర్తిస్థాయిలో అదుపులోకి వచ్చినట్టు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని, విద్యుత్తు సరఫరాను వేగంగా పునరుద్ధరించాలని కోరారు.

తడోబాలో పులి రాజసం

ప్రకృతి సౌందర్యం, అందాలపై ఎంపీ సంతోష్ ట్వీట్

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): సహజసిద్ధమైన ప్రకృతి సౌందర్యం, అడవి అందాలను గురించి బీఆర్‌ఎస్ నేత, రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. 'తడోబా-అంధేరి టైగర్ రిజర్వ్'లో మంగళవారం తన స్నేహితుడొకరు తీసిన ఓ వీడియోలో ప్రకృతి సహజ సౌందర్యాన్ని బంధించాడు అని పేర్కొన్నారు. ఒక గంభీర పులి పసందైన విందును ఆరగించి, పక్కనే చెరువులో మునిగి హుందాగా సేదదీరింది.. అని వివరించారు. తడోబా-అంధేరి టైగర్ రిజర్వ్ ఫారెస్టులో తన స్నేహితుడి సాహసాలను అసూయతో స్క్రోల్ చేస్తున్నానని తెలిపారు. 'కాంట్ వెయిట్ ఫర్ ద ఫుల్ డీబ్రీఫ్ అండ్ జా డ్రిప్పింగ్ స్నాప్‌షాట్స్' అంటూ తన ట్వీట్‌ను ముగించారు.

ట్రిబ్ ఇష్టారాజ్యం

- ఒక్కరోజులో టెట్ మార్కులను అప్‌లోడ్ చేయాలని ఆదేశం
- ఆందోళనలో అభ్యర్థులు

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): గురుకుల టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియను తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రిబ్) అధికారులు ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారు. అభ్యర్థులు వెంటనే తమ టెట్ మార్కులను అప్‌లోడ్ చేయాలని ట్రిబ్ ఈ నెల 20 ఒక ప్రకటనలో తెలిపింది. ఒక్కరోజు వ్యవధిలోనే అంటే 21 సాయంత్రం 5 గంటల్లోగా మార్కులు అప్‌లోడ్ చేయాలని సూచించింది. లక్షమందికిపైగా ఒక్కరోజు వ్యవధిలోనే మార్కులను అప్‌లోడ్ చేయాలని ఆదేశించడం గమనార్హం. అప్‌లోడ్ చేయబోతే సైట్ మొరాయించింది. హెల్ప్‌లైన్ లైన్‌నూ స్పందించకపోవడంతో అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురై మాసబ్‌ట్యాంక్‌లోని ట్రిబ్ కార్యాలయానికి పరుగెత్తారు. అప్పుడుగానీ అధికారులు స్పందించలేదు. టెట్ మార్కుల అప్‌లోడ్ చేసే గడువును ఒక్కరోజు.. అంటే 22 సాయంత్రానికి పొడిగించారు.

ఆదినుంచీ ఇదే హడావుడి..

ట్రిబ్ వ్యవహారంపై గురుకుల అభ్యర్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టింది మొదలు ఇదే రీతిన వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తుతున్నారు. డిసెండింగ్ ఆర్డర్‌లో పోస్టులను భర్తీ చేస్తామని చెప్పి అందుకు విరుద్ధంగా భర్తీ ప్రక్రియను ఆగమేఘాల మీద చేపట్టిందని ఆరోపించారు. డీఎల్, జేఎల్ పోస్టుల మెరిట్ జాబితాలను సైతం అదే రీతిన అర్ధరాత్రి విడుదల చేసి, రెండురోజుల వ్యవధిలోనే సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను చేపట్టింది. ఇప్పుడు ఒక్కరోజులోనే టెట్ మార్కుల అప్‌లోడ్ అంటూ ఆదేశించిందని భగ్గుమంటున్నారు.

త్వరలో మెగా డీఎస్సీ

పది రోజుల్లో డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. 11 వేలకుపైగా టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వానికి పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే ప్రతిపాదనలను పంపించింది. ప్రభుత్వ ఆమోదం రాగానే నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నది.

వైఎస్‌ను హత్య చేసింది ఎవరో నాకు తెలుసు

నా జోలికి వస్తే మీ బాగోతాలు బయటపెడతా: ఎంపీ అర్వింద్

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 21: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని హత్య చేయించింది ఎవరో తనకు తెలుసని, తన గురించి మాట్లాడితే ఆ చిట్టా విప్పుతానని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి హెచ్చరించారు. నిజామాబాద్‌లో బుధవారం నిర్వహించిన బీజేపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో అర్వింద్ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నేతలు వ్యక్తిగతంగా తనపైన, పార్టీ నేతలపైన తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. తన జోలికొస్తే కాంగ్రెస్ నేతల బాగోతం బయటపెడతానని, వైఎస్‌ను హత్య చేసింది ఎవరో పేర్లతో సహా వెల్లడిస్తానని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మూడు నెలల్లోనే రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. అభివృద్ధి చేయకుండానే బీజేపీ నాయకులను, ప్రధాని మోదీని విమర్శిస్తూ వ్యక్తిగతంగా దిగజారడం సరైన పద్ధతి కాదని చెప్పారు. తనపై, తన కార్యకర్తలపై ఎలాంటి ఆరోపణలు చేసినా మున్ముందు సహించేది లేదని హెచ్చరించారు.

రాజాసింగ్ గప్‌చుప్!

- పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఎమ్మెల్యే

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): బీజేపీ ఫైర్ బ్రాండ్ రాజాసింగ్ కొన్నాళ్లుగా గప్‌చుప్‌గా ఉంటున్నారు. పార్టీ కార్యక్రమాల్లోనూ పాల్గొనడం లేదు. లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'విజయ సంకల్ప యాత్ర'కు సైతం దూరంగా ఉన్నారు. రాష్ట్రనాయకత్వానికి, ఆయనకు మధ్య దూరం పెరుగుతున్నదనే వాదనకు ఇది మరింత బలం చేకూర్చుతున్నది. వరుసగా మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచిన తనకు అసెంబ్లీలో బీజేపీ పక్షనేతగా అవకాశం లభిస్తుందని రాజాసింగ్ భావించారు. అది నెరవేరారు తన్నుకుపోవడంతో అలకబూని పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలకు సైతం దూరంగా ఉన్నారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర పదాధికారుల సమావేశానికీ డుమ్మా కొట్టారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి సమీక్షలో కూడా పాల్గొనలేదు. జహీరాబాద్ ఎంపీ టికెట్ ఆశిస్తున్న ఆయన గెలిచి రాష్ట్ర నాయకత్వంతో సంబంధం లేకుండా ఢిల్లీ వెళ్లిపోవాలని యోచిస్తున్నట్టు సమాచారం.

సింగరేణిలో 485 పోస్టులకు నోటిఫికేషన్

- సంస్థ సీఎండీకి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం
- ఈ ఏడాది వెయ్యి కారుణ్య నియామకాలు
- సింగరేణి అభివృద్ధి, సంక్షేమంపై సమీక్ష
- నేడు నోటిఫికేషన్ జారీ చేస్తాం: సీఎండీ బలరామ్

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న 485 పోస్టులకు నోటిఫికేషన్లు ఇవ్వాలని ఆ సంస్థ సీఎండీ ఎన్ బలరామ్ నాయక్‌ను రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. ఇందులో 317 డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులు, 168 ఇంటర్నల్ రిక్రూట్‌మెంట్ ఉద్యోగాలు ఉన్నాయని, వీటిని తక్షణమే భర్తీ చేయాలని సూచించారు. సింగరేణిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై బుధవారం సచివాలయంలో సీఎండీ, డైరెక్టర్ ఎన్వీ కే శ్రీనివాస్, ఇతర ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. సింగరేణిలో కారుణ్య నియామకాల కింద ఈ ఏడాదిలో కనీసం వెయ్యి మంది వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని చెప్పారు. సింగరేణి కార్మికుల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ఎలాంటి ప్రీమియం చెల్లించకుండా చేసుకొన్న రూ. కోటి ప్రమాద బీమా అవగాహన ఒప్పం దం, పురోగతి గురించి ఆరా తీశారు. ఇప్పటి వరకు కోల్ ఇండియాలోనూ ఇలాంటి ఒప్పందం లేదని, త్వరలో మిగిలిన బ్యాంకులతోనూ ఈ ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకొంటామని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎంకు సీఎండీ బలరామ్ వివరించారు. సింగరేణి ఆధ్వర్యంలో కొత్తగూడెంలో నిర్మించిన 10.5 మెగావాట్ల సోలార్ ప్లాంటును ఈ నెల 26న ఆవిష్కరణకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. గోదావరిఖని, మంచిర్యాల కార్మికులకు సురక్షిత మంచినీరు అందించేందుకు వీలుగా చేపట్టిన ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్లర్ల ప్రారంభానికి సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.

నేడు నోటిఫికేషన్లు విడుదల

కాగా, డిప్యూటీ సీఎం ఆదేశాలమేరకు సింగరేణిలో 317 డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులు, 168 ఇంటర్నల్ రిక్రూట్‌మెంట్ ఉద్యోగాల భర్తీకి గురువారం నోటిఫికేషన్లు జారీ చేస్తామని సీఎండీ బలరామ్ వెల్లడించారు. వారసత్వ ఉద్యోగాల భర్తీకి వయో పరిమితిని 40 ఏండ్లకు పెంచే ప్రతిపాదనలపై అన్ని చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఎన్‌వికే శ్రీనివాస్‌ను ఆయన ఆదేశించారు.

గ్రూప్-2, 3లో అదనపు పోస్టులు!

- రెండు సప్లిమెంటరీ నోటిఫికేషన్లకు కసరత్తు

హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ 2022 గ్రూప్-2, గ్రూప్-3 నోటిఫికేషన్లలో అదనపు పోస్టులను కలిపే ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలిసింది. గ్రూప్-1 మాదిరే ఈ రెండు ఉద్యోగ నోటిఫికేషన్లలోనూ అదనపు పోస్టులు కలపాలనేది ప్రభుత్వ యోచన అని సమాచారం. 2022 గ్రూప్-2 నోటిఫికేషన్‌లో కటాఫ్ తేదీ ప్రకారం 18 విభాగాల్లో 783 ఖాళీలను చూపారు. ఇప్పటివరకు పెరిగిన పోస్టులతో అనుబంధ నోటిఫికేషన్ ఇవ్వనున్నదని తెలిసింది. 2022 డిసెంబర్ 30న విడుదలైన గ్రూప్-3 అదనపు ఖాళీ పోస్టులు కలుపుకొని అనుబంధ నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. గ్రూప్-3లో ప్రస్తుతం 1375 ఖాళీలు ఉన్నాయి.ర

ఇంటర్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

- టెలికాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): ఇంటర్మీడియట్ పరీక్షలను సమర్థంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టినట్టు సీఎస్ శాంతి కుమారి తెలిపారు. ఇంటర్మీడియట్, పదోతరగతి పరీక్షల సన్నద్ధతపై జిల్లాల కలెక్టర్లు, పోలీస్, విద్యాశాఖ, సంబంధిత అధికారులతో ఆమె బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 28 నుంచి జరిగే ఇంటర్ పరీక్షలకు 9.80 లక్షల మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. మొత్తం 1,521 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. వచ్చే నెల 18 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు 5.08 లక్షల మంది విద్యార్థులు హాజరవుతారని చెప్పారు. 2,676 కేంద్రాల్లో ఈ పరీక్షలు ఉంటాయని తెలిపారు.

సగం గల్లంతు

మొదటిపేజీ తరువాయి...

చేశారు. తాజాలో నోటిఫికేషన్‌లోని 563 పోస్టులను ప్రస్తుత విధానం ప్రకారం భర్తీ చేస్తే మహిళలకు 109 పోస్టులు మాత్రమే దక్కే అవకాశం ఉన్నది. హారిజాంటల్ పద్ధతిలో 33.333(33 1/3) శాతం మహిళా రిజర్వేషన్లను ప్రభుత్వం అమలు చేస్తున్నది. ఈ రిజర్వేషన్లను ప్రత్యేకంగా మార్కింగ్ చేయకుండా అమలు చేస్తున్నట్టు ఉత్తర్వులో పేర్కొన్నది. ఈ ఆదేశాల ప్రకారం ఏ క్యాటగిరీలో అయినా మూడు పోస్టులుంటే ఒక పోస్టును మహిళకు కేటాయించే అవకాశం ఉంటుంది. కానీ, ఒక క్యాటగిరీలో రెండు పోస్టులే ఉంటే ఆ రెండింటిని జనరల్ క్యాటగిరీతో మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. గ్రూప్ -1 నోటిఫికేషన్‌లో పేర్కొన్న ప్రకారం పలు విభాగాల్లోని పోస్టులు మూడు కంటే తక్కువగా ఉన్నాయి. దీంతో వీటన్నింటిలో మహిళా రిజర్వేషన్ ఉండదు.

సగానికి సగం కోత

గ్రూప్ -1 నోటిఫికేషన్‌లో పేర్కొన్న డిప్యూటీ కలెక్టర్ పోస్టులు మల్టీజోన్-1లో 20, మల్టీజోన్- 2లో 25 ఉన్నాయి. ఈ మొత్తం పోస్టులను పరిగణనలోకి తీసుకుంటే మహిళలకు మల్టీజోన్-1లో 7, మల్టీజోన్- 2లో 8 చొప్పున 15 పోస్టులు దక్కాలి. రిజర్వేషన్ క్యాటగిరీల ప్రకారం పరిశీలిస్తే మల్టీజోన్-1లో మహిళలకు ఓసీ క్యాటగిరీలో రెండు, ఎస్సీ క్యాటగిరీలో ఒక పోస్టు మాత్రమే ఉండనున్నది. మల్టీజోన్ -2లో మహిళలకు ఓసీ క్యాటగిరీలో 2 పోస్టులు.. ఎస్సీ, ఎస్టీ క్యాటగిరీల్లో చెరొక పోస్టు ఉంటుంది. మిగతా రిజర్వేషన్ క్యాటగిరీల్లో పోస్టుల సంఖ్య 2, అంతకంటే తక్కువ ఉండటంతో ఆయా పోస్టుల్లో ప్రత్యేకంగా మహిళా రిజర్వేషన్ ఉండదు. వీటన్నింటినీ జనరల్ క్యాటగిరీలోనే భర్తీ చేస్తారు. మొత్తంగా డిప్యూటీ కలెక్టర్ పోస్టుల్లో మహిళలకు ఏడు పోస్టులు మాత్రమే కచ్చితంగా దక్కనున్నాయి. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు (డీఎస్పీ) 115 పోస్టులు ఉన్నాయి. మల్టీజోన్-1 పరిధిలో 52 ఉద్యోగాలు ఉన్నాయి. 33 శాతం రిజర్వేషన్ ప్రకారం 17 పోస్టులు రావాలి. తాజా నోటిఫికేషన్ ప్రకారం 13 ఉద్యోగాలు మహిళలకు దక్కే అవకాశం ఉన్నది. మల్టీజోన్-2 పరిధిలో 63 పోస్టుల్లో 33 శాతం ప్రకారం 20 పోస్టులు మహిళలకు దక్కాలి. నోటిఫికేషన్ ప్రకారం 17 పోస్టులే దక్కనున్నాయి. మహిళా రిజర్వేషన్ కోటా కంటే మిగిలిన పోస్టులను ఆయా రిజర్వేషన్‌లోని జనరల్ క్యాటగిరీలో భర్తీ చేయనున్నారు. కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ (సీటీవో) పోస్టులు 48 ఉన్నాయి. వీటిలో 33 శాతం లెక్కన మహిళలకు 16 పోస్టులు దక్కాలి. నోటిఫికేషన ప్రకారం 9 పోస్టులే మహిళలకు దక్కే అవకాశం ఉన్నది. మల్టీజోన్-1 పరిధిలోని 12 పోస్టుల్లో ఓసీ క్యాటగిరీలో ఒక్కటే పోస్టు ఉన్నది. మల్టీజోన్-2 పరిధిలో ఓసీలో 4, ఈడబ్ల్యూఎస్, బీసీ-ఏ, బీసీ-బీ, ఎస్సీ, ఎస్టీలో ఒక్కటి చొప్పున మహిళలకు పోస్టు దక్కనున్నాయి. మిగతా పోస్టులన్నీ జనరల్ క్యాటగిరీలోనే భర్తీ చేయనున్నారు. రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ పంచాయతీ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్, డిస్ట్రిక్ట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ పోస్టులన్నీ మహిళా కోటా లేకుండా ఆయా రిజర్వేషన్‌కు సంబంధించిన జనరల్ క్యాటగిరీలోనే భర్తీ చేసే అవకాశం ఉన్నది. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-2, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (మెడికల్ అండ్ హెల్త్), అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ ఉద్యోగాల్లో బీసీ క్యాటగిరీలో మహిళలకు ఒక్క పోస్టు సైతం దక్కే అవకాశం లేదు.

క్యారీఫార్వర్డ్ పోస్టులు

టీఎస్‌పీఎస్సీ తాజా గ్రూప్ -1 నోటిఫికేషన్‌లో 16 పోస్టులను క్యారీఫార్వర్డ్ చేసినట్టు ప్రకటించారు. వీటిలో ఓపెన్ క్యాటగిరీకి చెందినవి 7 పోస్టులు.. బీసీ-బీకి 1, ఎస్సీకి 1, ఎస్టీకి 1, హియరింగ్ హ్యాండిక్యాప్డ్ (హెచ్‌హెచ్) క్యాటగిరీలో 4, విజువల్లీ హ్యాండిక్యాప్డ్ (వీహెచ్) క్యాటగిరీలో 2 చొప్పున పోస్టులు ఉన్నాయి. క్యారీఫార్వర్డ్ చేసిన ఈ పోస్టులు జనరల్ క్యాటగిరీకి చెందినవా? వీటిలో మహిళలకు రిజర్వు చేసిన పోస్టులు ఎన్ని అనేది స్పష్టత లేదని నిరుద్యోగులు చెప్తున్నారు. ఏదైనా క్యాటగిరీలో రిజర్వ్ చేసిన పోస్టులకు సరైన అభ్యర్థులు లేనప్పుడు వాటిని తదుపరి ఇచ్చే నోటిఫికేషన్‌తో అదే రిజర్వేషన్ అభ్యర్థులతో భర్తీ చేయడాన్ని క్యారీఫార్వర్డ్ అంటారు. ఇక్కడ క్యారీఫార్వర్డ్ చేసిన పోస్టులు ఏ క్యాటగిరీకి చెందినవి అనేది స్పష్టత ఇవ్వాలని అభ్యర్థులు కోరుతున్నారు.

త్వరలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ : టీఎస్‌పీఎస్సీ

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : వివిధ ఉద్యోగాల పరీక్షల ఫలితాలను తమ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచామని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి బుధవారం తెలిపారు. త్వరలోనే ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ చేపడుతామని, అందుకోసం అభ్యర్థులంతా సిద్ధంగా ఉండాలని సూచించారు. కమ్యూనిటీ, ఈడబ్ల్యూఎస్, బీసీలకు నాన్-క్రీమీలేయర్, స్టడీ/రెసిడెన్సీ, రిజర్వేషన్ క్లైమింగ్‌తోపాటు విద్యార్హతలు వంటి వాటి ఆధారాలు (ధృవీకరణ పత్రాలు)కూడా సిద్ధం చేసుకోవాలని తెలిపారు.

25న సీవోఈ రెండో దశ ప్రవేశ పరీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి21 (నమస్తే తెలంగాణ): ఎస్సీ గురుకులాలకు చెందిన 38 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) కళాశాలల్లో ప్రవేశాలకు రెండోదశ పరీక్షను ఈ నెల 25న నిర్వహించనున్నట్టు సొసైటీ కార్యదర్శి సీతాలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ ప్రకారం 1:5 నిష్పత్తిలో విద్యార్థులను ఎంపిక చేశామని, వీరంతా పరీక్షకు హాజరుకావాలని చెప్పారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను ఎస్సీ గురుకులాల సొసైటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని, హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

అగ్రికల్చర్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్ ఫలితాలు విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్‌లో అకౌంట్స్ ఆఫీసర్స్ పోస్టులు, అగ్రికల్చర్ అండ్ కోపరేటివ్ డిపార్టుమెంట్‌లోని అగ్రికల్చర్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి సంబంధించిన రాత పరీక్ష ఫలితాలు బుధవారం టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి విడుదల చేశారు. ఈ ఫలితాలను టీఎస్‌పీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు తెలిపారు. త్వరలోనే మెరిట్ జాబితాలో ఉన్న అభ్యర్థులను సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలుస్తామని చెప్పారు. అయితే, నిరుడు మే నెలలో అగ్రికల్చర్ ఆఫీసర్ ఉద్యోగాలకు, ఆగస్టులో అకౌంట్స్ ఆఫీసర్స్ పోస్టులకు రాత పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే.

నర్సింగ్ ఆఫీసర్లను టీఎస్‌పీఎస్సీ భర్తీ చేసిందట!

- *టీవీవీపీలో నిర్లక్ష్యంగా మూవ్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చిన అధికారులు*
- *ఎంహెచ్‌ఎస్‌ఆర్బీకి బదులు టీఎస్‌పీఎస్సీ పేరుతో ఉత్తర్వులు జారీ*

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): నర్సింగ్ ఆఫీసర్లను (స్టాఫ్ నర్స్) పోస్టుల నియామక ప్రక్రియలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్తు (టీవీవీపీ) పరిధిలో నియమితులైన అభ్యర్థులకు తప్పుడు పేర్లతో మూవ్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వడం కలకలం రేపింది. ఇటీవల నిర్వహించిన నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీ ప్రక్రియ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్‌ఎస్‌ఆర్బీ) ఆధ్వర్యంలో జరిగింది. అయితే మూవ్‌మెంట్ ఆర్డర్లు మాత్రం టీఎస్‌పీఎస్సీ పేరుతో ఇచ్చారు. దీంతో అభ్యర్థులు అయోమయానికి గురయ్యారు. ఆ తర్వాత అభ్యర్థులు ప్రశ్నించడంతో అధికారులు తూచ్ అంటూ.. ఇచ్చిన లెటర్లను వెనక్కి తీసుకొని, మళ్లీ ఎంహెచ్‌ఎస్సార్బీ పేరుతో ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఘటన నల్లగొండ జిల్లాలో కలకలం రేపింది. జిల్లాకు చెందిన ఓ అభ్యర్థి ఇటీవల నర్సింగ్ ఆఫీసర్ పోస్టుకు ఎంపికయ్యారు. ఆ అభ్యర్థికి జిల్లాలోని ఓ దవాఖానను కేటాయిస్తూ, అందులో చేరాలంటూ మంగళవారం జిల్లా దవాఖాన సూపరింటెండెంట్ మూవ్‌మెంట్ ఆర్డర్ ఇచ్చారు. అందులో టీఎస్‌పీఎస్సీ ద్వారా నిర్వహించిన పరీక్షలో ఎంపిక అయినట్టు పేర్కొన్నారు. ఆ అభ్యర్థి దవాఖానకు వెళ్లి ఆర్డర్ చూపించగా, అక్కడి అధికారులు తప్పును గుర్తించారు. జిల్లావ్యాప్తంగా టీవీవీపీ పరిధిలో కేటాయించిన అభ్యర్థులందరికీ ఇలాంటి ఆర్డర్లే ఇచ్చినట్టు తేలింది. అభ్యర్థులు ప్రశ్నించడంతో వెంటనే ఆ ఆర్డర్లన్నింటినీ వెనక్కి తీసుకుని, ఎంహెచ్‌ఎస్సార్బీ పేరుతో ఉత్తర్వులు మార్చి ఇచ్చారు. ఈ విషయంపై కొందరు అభ్యర్థులు టీవీవీపీ అధికారులను ప్రశ్నించగా.. 'రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ టీఎస్‌పీఎస్సీ నుంచి వచ్చింది. ఎంహెచ్‌ఎస్‌ఆర్బీ కేవలం ఒక ఏజెన్సీ మాదిరిగా నియామక ప్రక్రియను చేపట్టింది' అంటూ బుకాయించినట్టు తెలిసింది. వాస్తవానికి 5,204 నర్సింగ్ ఆఫీసర్ల నియామకానికి 2022 డిసెంబర్ 30న బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంహెచ్‌ఎస్‌ఆర్బీ నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 9 విభాగాల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించింది. ఇందులో టీవీవీపీ పరిధిలో 757 పోస్టులు ఉన్నాయి. దరఖాస్తులు, పరీక్షలు వంటి కీలక ప్రక్రియ మొత్తం గత ఏడాది పూర్తయింది. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత అదనంగా పోస్టులు కలిపి, ఫలితాలు విడుదల చేసింది. దాదాపు 7 వేల మందికి నియామకపత్రాలను అందించింది.